సాక్షి

డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

శనివారం । 6 । మే । 2023



అప్రమత్తత లేకుంటే ఆటపోట్లు

ప్రస్తుతం సెలవులు కావడంతో పిల్లలు వివిధ రకాల ఆటలు ఆడటానికి ఉత్సాహం చూపుతారు. ఈ క్రమంలో జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. - IIలో



ఘనంగా సత్యదేవుని శ్రీచక్రస్నానం

దివ్యకల్యాణ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం పంపా సరోవరంలో సత్యదేవుడు, అనంతలక్ష్మి సత్యవతీదేవి అమ్మవార్ల శ్రీచక్రస్నాన ఉత్సవం ఘనంగా నిర్వహించారు. - IIలో

శ్రీవారి రథయాత్ర రద్దు



ద్వారకా తిరుమల: శ్రీవారి వైశాఖమాస దివ్య బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి నిర్వహించాల్సిన రథోత్సవాన్ని ప్రతికూల వాతావరణం కారణంగా రద్దు చేశారు.

న్యూస్‌రీల్

ప్రతి గింజా కొనుగోలు చేస్తాం

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

పెరవలి: తడిసిన ప్రతి ధాన్యం గింజనూ కొనుగోలు చేస్తామని పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు రైతులకు భరోసా ఇచ్చారు. తూర్పు గోదావరి జిల్లా పెరవలి మండలం కానూరులో శుక్రవారం ఆయన పర్యటించారు. తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. రోడ్లు, రాశులు, పొలాల్లో ఉన్న ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని మంత్రి సూచించారు. ఇందుకు వేగంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. తేమ, ముక్క శాతం ఎక్కువగా ఉందని చెబుతూ రైతులను ఇబ్బందులకు గురి చేయవద్దని స్పష్టం చేశారు. మిల్లర్లకు రైతులు ఎలాంటి సొమ్ము చెల్లించనవసరం లేదని రైతులకు చెప్పారు. మిల్లర్లకు ఈ విషయంలో స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని అధికారులకు మంత్రి కారుమూరి సూచించారు. అంతకుముందు జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్ ఇక్కడ ధాన్యాన్ని పరిశీలించారు.

ఉచిత పీయూసీ శిబిరం



వాహనచోదకులకు పీయూసీలు అందిస్తున్న జిల్లా రవాణా అధికారి అశోక్ ప్రతాప్, సీఐ వీరబాబు, గెయిల్ అధికారులు

అమలాపురం రూరల్: చమురు, సహజవాయుదు సంరక్షణ ఉత్సవాల్లో భాగంగా కామనగరువు ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఆవరణలో శుక్రవారం ఉచిత కాలుష్య నివారణ శిబిరం నిర్వహించారు. గెయిల్ చీఫ్ మేనేజర్ కూరగంటి రాంబాబు ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమాన్ని జిల్లా రవాణా అధికారి అశోక్ ప్రతాప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణకు గెయిల్ చేస్తున్న కృషి ఎంతో అభినందనీయమని కొనియాడారు. రాంబాబు మాట్లాడుతూ, కాలుష్యాన్ని తగ్గించేందుకు గెయిల్ ఆధ్వర్యాన ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. కళాజాతాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఇంధన పరిరక్షణ ఆవశ్యకతను వివరించారు. ఈ సందర్భంగా పలువురు వాహన చోదకులకు పొల్యూషన్ అండర్ కంట్రోల్ (పీయూసీ) సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో రూరల్ సీఐ వీరబాబు, తహసీల్దార్ పరమట శ్రీవల్లవి, పాఠశాల డైరెక్టర్ మను విహార్, గెయిల్ అధికారులు సుధీర్, రామకృష్ణ, డేవిడ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

సత్యదేవుని దర్శించిన 40 వేల మంది భక్తులు



సత్యదేవుని వ్రతాలాచరిస్తున్న భక్తులు

అన్నవరం: వైశాఖ పౌర్ణమి పర్వదినం కావడంతో సత్యదేవుని సన్నిధికి శుక్రవారం వేలాదిగా భక్తులు తరలివచ్చారు. సుమారు రెండు నెలల విరామం అనంతరం వివాహాలు జరుగుతూండటంతో పెద్ద సంఖ్యలో నవదంపతులు, మరోవైపు సత్యదేవుని దర్శనానికి వచ్చిన భక్త జనంతో ఆలయం కిక్కిరిసింది. స్వామివారిని సుమారు 40 వేల మంది దర్శించుకున్నారు. ఉచిత దర్శనానికి రెండు గంటలు, ప్రత్యేక దర్శనానికి గంట పట్టింది. ఆలయప్రాంగణం, వ్రతమండపాలు, క్యూ లైన్లు అన్నీ భక్తులతో నిండిపోయాయి. వ్రతాలు 3,500 జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం వచ్చింది.

వికాసలో 8న జాబ్‌మేళా

కాకినాడ సిటీ: తమ కార్యాలయంలో ఈ నెల 8న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు శుక్రవారం తెలిపారు. ఎన్ ఇన్ సిస్టమ్ ఎస్‌బీసీ కంపెనీలో యుఎస్ ఐటీ రిక్రూట్‌మెంట్, బెంచ్ సేల్స్ రిక్రూటర్, బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్, ఓపీపీ రిక్రూటర్స్, జీకే గ్రూప్స్ లిమిటెడ్‌లో క్వాలిటీ కంట్రోల్, అకౌంట్స్ అండ్ కలెక్షన్, సేల్స్ అండ్ మార్కెటింగ్, ఎంకే స్కిన్ హాస్పిటల్‌లో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, ఫ్రంట్ ఆఫీస్ కౌన్సిలర్, నిట్ (ఐసీఐసీఐ) బ్యాంకులో రిలేషన్‌షిప్ మేనేజర్, డెక్కన్ కెమికల్స్ కంపెనీలో ట్రైనీ, హోండాయ్ మోబీస్‌లో టెక్నీషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. ఈ ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్ ఉత్తీర్ణులైన 35 ఏళ్ల లోపు అభ్యర్థులు అర్హులన్నారు. వీరికి నెలకు రూ.10 వేల నుంచి రూ. 25 వేల జీతం, ఆయా ఉద్యోగాలను బట్టి ఇన్సెంటివ్‌లు, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఉంటాయని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఆ రోజు ఉదయం కలెక్టరేట్ ఆవరణలోని వికాస కార్యాలయానికి సర్టిఫికెట్ల జిరాక్సులతో హాజరు కావాలి.

కష్టాల వేళ.. కొండంత అండ

- తడిసిన ధాన్యం కొనుగోలుకు సీఎం జగన్ ఆదేశాలు
- ఏర్పాట్లు చేస్తున్న జిల్లా యంత్రాంగం
- నాలుగు రోజుల్లో 7,702.89 మెట్రిక్ టన్నుల కొనుగోళ్లు
- అన్నదాతలకు ఊరట



కె.గంగవరం మండలం కుందూరు వద్ద ఎండలో ఆరబోసిన ధాన్యం

సాక్షి, అమలాపురం: అకాల వర్షాలతో అనుకోని కష్టాలను ఎదుర్కొంటున్న అన్నదాతలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొండంత అండగా నిలిచారు. తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. ఉపరితల ద్రోణి ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు రాశుల లోను, పనల మీద ఉన్న ధాన్యం తడిసిన విషయం తెలిసిందే. ఆరుగాలం చెమట చిందించి, పండించిన పంట చేతికందుతుందనుకున్న వేళ.. జడివానలో తడిసి ముద్దవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ తరుణంలో వారికి సీఎం జగన్ చేసిన ప్రకటన ఊరటనిచ్చింది. సీఎం ఆదేశాలకు అనుగుణంగా జిల్లా యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది.

తడిసిన ధాన్యం 1,470 మెట్రిక్ టన్నులు

జిల్లా వ్యాప్తంగా 1.71 లక్షల ఎకరాల్లో రబీ వరి సాగు జరిగింది. వర్షాలు ఆరంభమయ్యే నాటికి 72 వేల ఎకరాల్లో కోతలు జరిగాయి. భారీ వర్షాలు కురుస్తున్న సమయానికి పనల మీద ఉన్న సుమారు 450 ఎకరాల్లో చేలు నీట మునిగాయి. రాశుల మీద ధాన్యం వద్ద ముందే జాగ్రత్తలు తీసుకువడంతో పెద్దగా నష్టం జరగలేదు. కానీ పనల మీద ఉన్న ధాన్యం అధికంగా దెబ్బ తింది. ఈ పరిస్థితుల్లో తడిసిపోవడంతో తేమ ఎక్కువై, రంగు మారి రేటు తగ్గుతుందని రైతులు ఆందోళన చెందారు. ఈ వర్షాలకు జిల్లాలో 1,470 మెట్రిక్ టన్నుల ధాన్యం తడిసిందని అధికారులు గుర్తించారు. వీటిని బయటి వ్యాపారులకు అమ్మితే నష్టపోతామని రైతులు ఆవేదన చెందారు. సీఎం జగన్ ఆదేశాలతో జిల్లా యంత్రాంగం దీనిపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. తడిసిన ధాన్యాన్ని బాయిల్డ్ మిల్లులకు పంపాలని నిర్ణయించినట్టు జిల్లా వ్యవసాయ అధికారి కాకి నాగేశ్వరరావు 'సాక్షి'కి తెలిపారు. రైతులు అధైర్యపడవద్దని, రైతుభరోసా కేంద్రాలను (ఆర్‌బీకే) సంప్రదించడం ద్వారా ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకోవాలని సూచించారు. జిల్లాలో శుక్రవారం 1,843.250 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. దీనిలో వర్షాలకు తడిసిన ధాన్యం కూడా ఉందని జిల్లా పౌరసరఫరాల అధికారి సుధాకర్ తెలిపారు.

రెండు రోజులుగా కలిసి వచ్చిన వాతావరణం

గత సోమవారం భారీ వర్షం కురిసింది. మంగళ, బుధవారాల్లో కూడా అడపాదడపా ఒక మోస్తరు వర్షం కురిసింది. దీంతో రైతులు పనలను గట్ల మీదకు తీసుకు రాలేకపోయారు. అయితే గురు, శుక్రవారాల్లో వేసవి తరహా ఎండలు కాశాయి. వాతావరణం కాస్త కలసి రావడంతో రైతులు మాసూళ్లు ముమ్మరం చేశారు. తుపాను హెచ్చరికల నేపథ్యంలో కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని చకచకా ఒబ్బిడి చేస్తున్నారు. కోతల జోరు పెంచారు. తడిసిన, తేమ ఎక్కువగా ఉన్న ధాన్యాన్ని ఎండలో ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా నాలుగు రోజులుగా 7,702.89 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. ఇప్పటి వరకూ రబీలో జిల్లా వ్యాప్తంగా 43,019.660 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరిగింది.



ముమ్మిడివరం వద్ద ధాన్యం పట్టుబడులు

బొండాల కొనుగోలుకు పచ్చజెండా

ఈ ఏడాది ఎంటీయూ–3626 (బొండాలు) సాగుకు ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదు. సాగు చేసినా ధాన్యం కొనుగోలు చేయబోమని చెప్పింది. అయినప్పటికీ రబీలో అధిక దిగుబడి వస్తోందని రైతులు ఈ రకం సాగు చేశారు. తూర్పు డెల్టాలోని మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల పరిధిలో ఏకంగా 80 శాతం బొండాల రకమే కావడం గమనార్హం. ఈ నేపథ్యంలో రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకున్న ప్రభుత్వం బొండాల కొనుగోలుకు అంగీకారం తెలిపింది. ప్రస్తుతం కొనుగోలులో ఎక్కువగా బొండాల రకమే ఉండటం విశేషం.

రైతులు ఆందోళన చెందవద్దు



అకాల వర్షాలకు తడిసి, రంగు మారినప్పటికీ రైతుల నుంచి మొత్తం ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఈ విషయంలో అన్నదాతలు ఎటువంటి భయాందోళనలూ చెందవద్దు. ఆరబెట్టిన ధాన్యాన్ని సాధ్యమైనంత త్వరగా విక్రయించాలి.

– హిమాన్షు శుక్లా, కలెక్టర్

తడిసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలి

- కలెక్టర్ హిమాన్షు శుక్లా
- వాడ్రేవుపల్లిలో ధాన్యం, పంటల పరిశీలన



తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, జేసీ ధ్యానచంద్ర

పి.గన్నవరం: ఇటీవల కురిసిన అకాల వర్షాలకు తడిసిపోయిన ధాన్యాన్ని రైతులు వెంటనే ఆరబెట్టుకోవాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా సూచించారు. అకాల వర్షాలకు మండలంలోని వాడ్రేవుపల్లిలో తడిసిన ధాన్యపు రాశులను, వరి చేలను శుక్రవారం ఆయన పరిశీలించారు. నేరుగా పొలాల్లోకి వెళ్లి రైతులతో మాట్లాడారు. తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హిమాన్షు శుక్లా రైతులతో మాట్లాడుతూ, శనివారం సాయంత్రానికి మిల్లులకు తరలించాలని సూచించారు. రైతులు ఎంతో శ్రమించి, పండించిన పంట అకాల వర్షాలకు తడిసిపోయిందని, రంగు మారినప్పటికీ ప్రతి ధాన్యపు గింజనూ ప్రభుత్వ పరంగా కొనుగోలు చేస్తామని భరోసా ఇచ్చారు. తడిసి, రంగుమారి ముక్కలవుతున్న ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తామని, దీనిపై ఆందోళన చెందవద్దని రైతులకు విజ్ఞప్తి చేశారు. ధాన్యం రవాణాకు అవసరమైన గోనె సంచులను రైతులకు వెంటనే సరఫరా చేయాలని, రవాణా సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. తుపాను హెచ్చరికలకు అనుగుణంగా చేతికి అందివచ్చిన పంటలను కాపాడుకునేలా రైతులు జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా కోరారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర, తహసీల్దార్ జి.రవీంద్రనాథ్ ఠాగూర్, మండల వ్యవసాయ అధికారి కళ్యాణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

31న తలుపులమ్మ ఆలయం పునఃప్రారంభం

తుని రూరల్: లోవ దేవస్థానంలో తలుపులమ్మ అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠ, నూతన ఆలయం ప్రారంభోత్సవ కార్యక్రమాలు ఈ నెల 31న నిర్వహించనున్నట్టు ఆలయ చైర్మన్ గొర్లి అచ్చియ్యనాయుడు, ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. లోవ దేవస్థానంలో చైర్మన్ అచ్చియ్యనాయుడు అధ్యక్షతన శుక్రవారం ధర్మకర్తలు, వివిధ గ్రామస్తులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఉత్తరాయణ పర్వదినాల్లో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ, ఆలయ ప్రవేశానికి ముహూర్తం ఖరారు చేశామని చెప్పారు. ఈ నెలలోనే ప్రతిష్ఠ, ప్రారంభోత్సవాలు నిర్వహించేందుకు ధర్మకర్తల మండలి తీర్మానించిందన్నారు. విగ్రహ ప్రతిష్ఠోత్సవాలను ఐదు రోజుల పాటు నిర్వహిస్తామని, ఒక్కో రోజు ఒక్కో గ్రామం నుంచి భక్తులు తరలివచ్చి, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసేందుకు ప్రణాళిక రూపొందించామని తెలిపారు. రూ.5 కోట్లతో అమ్మవారి ప్రధాన గర్భాలయాన్ని కృష్ణశిలలతో పునర్నిర్మిస్తుండడంతో పాటు ఐదంతస్తుల మహా మండపాన్ని నిర్మిస్తున్న విషయం తెలిసిందే. దీంతో గత డిసెంబర్ నుంచి ప్రధానాలయంలో అమ్మవారి దర్శనాలను నిలిపివేశారు. బాలాలయంలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాన్ని దర్శించేందుకు భక్తులను అనుమతించారు. విగ్రహ ప్రతిష్ఠ, ఆలయ ప్రారంభోత్సవం చేసినప్పటికీ పూర్తిస్థాయిలో భక్తులకు అందుబాటులోకి రావడానికి మరో రెండు నెలలు పడుతుందని అచ్చియ్య నాయుడు తెలిపారు. లోవ మాజీ చైర్మన్ దూలం మాణిక్యం, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతల రమణ, రాజుపేట సర్పంచ్ బుద్దా సత్తిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు లంక కృపానందం, దుంగల నాగేశ్వరరావు, తమరాన శ్రీనివాసరావు, కిల్లాడ గోవిందు, ధర్మకర్తలు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.



లోవ దేవస్థానంలో ధర్మకర్తలు, వివిధ గ్రామాల నాయకులతో సమావేశం నిర్వహిస్తున్న చైర్మన్ అచ్చియ్య నాయుడు, ఈఓ విశ్వనాథరాజు

నిరుపేదల వివాహాల కోసమే..

- అందుకే వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫా
- ఎంపీ చింతా అనురాధ
- కలెక్టరేట్‌లో లబ్ధిదారులకు మెగా చెక్ అందజేత



లబ్ధిదారులకు మెగా చెక్ అందజేస్తున్న ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, కలెక్టర్ హిమాన్షు శుక్లా

సాక్షి, అమలాపురం: నిరుపేదలు తమ పిల్లల వివాహాన్ని గౌరవ ప్రదంగా నిర్వహించేందుకే వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా కింద రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోందని అమలాపురం ఎంపీ చింతా అనురాధ అన్నారు. ఈ పథకాల కింద ఇస్తున్న నగదు సాయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి రెండో విడతగా అర్హులైన వధువుల తల్లుల ఖాతాల్లో శుక్రవారం డీబీటీ ద్వారా జమ చేశారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో కలెక్టర్ హిమాన్షు శుక్లా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ, బాల్య వివాహాల నిరోధానికి, చదువులపై ఆసక్తిని పెంపొందించడంతో పాటు యుక్త వయసులో వివాహాలు చేసే దిశగా ప్రోత్సహించేందుకు ఈ రెండు పథకాలూ దోహదపడతాయని అన్నారు. ఈ పథకాల కింద జిల్లావ్యాప్తంగా రెండో విడతగా గత జనవరి నుంచి మార్చి వరకూ 754 జంటలకు రూ.5.48 కోట్ల మేర లబ్ధి చేకూరిందన్నారు. ఎస్సీ వర్గానికి చెందిన 287 జంటలకు రూ.లక్ష చొప్పున రూ.2.87 కోట్లు, ఎస్సీ కులాంతర వివాహాలు చేసుకున్న 16 జంటలకు రూ.1.20 లక్షల చొప్పున రూ.19.20 లక్షలు, ఎస్టీ వర్గానికి చెందిన మూడు జంటలకు రూ.లక్ష చొప్పున రూ.3 లక్షలు, ఎస్టీ కులాంతర వివాహం చేసుకున్న ఒక జంటకు రూ.1.20 లక్షలు, బీసీ వర్గానికి చెందిన 408 జంటలకు రూ.50 వేల చొప్పున రూ.2.04 కోట్లు, బీసీ కులాంతర వివాహాలు చేసుకున్న 15 జంటలకు రూ.75 వేల చొప్పున రూ.11.25 లక్షలు, మైనార్టీ వర్గానికి చెందిన రెండు జంటలకు రూ.లక్ష చొప్పున రూ.2 లక్షలు, విభిన్న ప్రతిభావంతులైన 11 దివ్యాంగ జంటలకు రూ.1.50 లక్షల చొప్పున రూ.16.50 లక్షలు, భవన నిర్మాణ కార్మిక వర్గానికి చెందిన 11 జంటలకు రూ.40 వేల చొప్పున రూ.4.40 లక్షల మేర లబ్ధి చేకూరిందని వివరించారు. ఈ మేరకు మెగా చెక్కును లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం జగనన్న ప్రభుత్వ సంక్షేమ క్యాలెండర్ 2023–24ను ప్రజాప్రతినిధులు, అధికారులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర దృశ్యకళల అకాడమీ చైర్మన్ కుడుపూడి సత్యశైలజ, హితకారిణి సమాజం అధ్యక్షురాలు కాశి బాలమునికుమారి, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, జిల్లా వక్ఫ్ బోర్డ్ అధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్, డీఆర్‌డీఏ పీడీ వి.శివశంకర్ ప్రసాద్, సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి పి.జ్యోతిలక్ష్మీదేవి, జిల్లా బీసీ సంక్షేమ అధికారి టి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పదిలమేనా!

- నేడు టెన్త్ ఫలితాల విడుదల
- విద్యార్థులు, విద్యాశాఖాధికారుల్లో ఉత్కంఠ
- జిల్లాలో పరీక్షలు రాసిన 19,327 మంది



రాయవరం: పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాలు శనివారం విడుదల కానున్నాయి. విద్యార్థి దశలో ఎదుర్కొనే తొలి పబ్లిక్ పరీక్షల ఫలితాలపై అందరి దృష్టీ కేంద్రీకృతమై ఉంటుంది. గత విద్యా సంవత్సరం ఉమ్మడి జిల్లా పరిధిలో పరీక్షలు జరగగా.. ఈసారి కొత్త జిల్లాల వారీగా నిర్వహించారు. గత ఏడాది జిల్లా 68.92 శాతం ఉత్తీర్ణత సాధించింది. 82.61 శాతం ఉత్తీర్ణతతో ముమ్మిడివరం, 75 శాతంతో మండపేట, 73.58 శాతంతో అమలాపురం నియోజకవర్గాలు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. మండలాల వారీగా ఉప్పలగుప్తం 97.6, కపిలేశ్వరపురం 95.3, ఐ.పోలవరం 93.9 శాతంతో వరుసగా మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. యాజమాన్యాల వారీగా చూస్తే ఏపీఆర్‌ఈఐ సొసైటీ స్కూల్స్ 98.5, ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ 92, జెడ్పీ పాఠశాలలు 62 శాతంతో మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. ఈ ఏడాది జిల్లా స్థానం సాధిస్తుందనే అంశంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

గత ఏడాది టెన్త్ ఫలితాలు ఇలా..

ఉమ్మడి తూర్పు గోదావరి	
ఉత్తీర్ణత శాతం	: 65.83
రాష్ట్రంలో స్థానం	: 4
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో..	
పరీక్షలు రాసిన విద్యార్థులు	: 19,760
ఉత్తీర్ణులైన వారు	: 13,615
ఉత్తీర్ణత శాతం	: 68.92

పరీక్షలు నిర్వహించారిలా..

ఈ ఏడాది పదో తరగతి పరీక్షలు గత నెల 3 నుంచి 15వ తేదీ వరకూ నిర్వహించారు. వీటికి 19,327 మంది దరఖాస్తు చేశారు. పరీక్షల నిర్వహణకు జిల్లా వ్యాప్తంగా 111 కేంద్రాలు ఏర్పాటు చేశారు. తెలుగు పరీక్షకు 19,199 మంది హాజరయ్యారు. అలాగే హిందీ పరీక్షకు 19,003 మందికి గాను 18,908 మంది, ఇంగ్లిషుకు 19,215 మందికి 19,112, గణితం 20,160 మందికి 19,989, సైన్స్ 20,139 మందికి 19,964, సోషల్ పరీక్షకు 19,321 మందికి గాను 19,176 మంది హాజరయ్యారు. అన్ని పరీక్షలు కలిపి సరాసరిన 99.34 శాతం మంది పరీక్షలు రాశారు. పరీక్షల నిర్వహణకు జిల్లా యంత్రాంగం పటిష్ఠ ఏర్పాట్లు చేసింది. ఈ ఏడాది ఒక్కో పరీక్ష 100 మార్కుల చొప్పున ఐదు పేపర్లు, పీఎస్, బయాలజీ 50 మార్కుల చొప్పున నిర్వహించారు. తొలిసారిగా అన్ని పరీక్షలకూ బుక్‌లెట్ విధానం అమలు చేశారు.

రికార్డు సమయంలో..

ఈ ఏడాది రికార్డు సమయంలో ప్రభుత్వం టెన్త్ ఫలితాలు విడుదల చేస్తోంది. గత నెల 15వ తేదీ వరకూ పదో తరగతి పరీక్షలు నిర్వహించగా 19 నుంచి 26వ తేదీ వరకూ జవాబు పత్రాల మూల్యాంకనాన్ని అమలాపురంలో నిర్వహించారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన 1.84 లక్షల జవాబు పత్రాల మూల్యాంకనం గడువులోపే పూర్తి చేశారు. ఇది పూర్తయిన పది రోజుల్లోనే ఫలితాలు విడుదల చేస్తుండటం గమనార్హం. విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి అకడమిక్, పరీక్షల నిర్వహణ వరకూ ప్రతి దశలోనూ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా వ్యవహరించిందనడానికి ఈ ఫలితాల విడుదలే నిదర్శనమని విద్యారంగ నిపుణులు విశ్లేషిస్తున్నారు. గత ఏడాది మాదిరిగానే ఈసారి కూడా ఫలితాలు ఆశాజనకంగానే ఉంటాయని ఉపాధ్యాయులు, విద్యా శాఖ అధికారులు భావిస్తున్నారు. మరోపక్క ఫలితాల కోసం విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఉత్కంఠతో చూస్తున్నారు.

ఫలితాలపై నమ్మకముంది



పదో తరగతి ఫలితాల్లో జిల్లా మెరుగైన స్థానం సాధిస్తుందన్న నమ్మకం ఉంది. పరీక్షలకు ముందుగా పదో తరగతి విద్యార్థులకు 100 రోజుల ప్రణాళిక అమలు చేశాం. ప్రతి విద్యార్థీ ఉత్తీర్ణత సాధించే విధంగా వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాం. పరీక్షలు కూడా సమర్థవంతంగా నిర్వహించాం.

– ఎం.కమలకుమారి, జిల్లా విద్యాశాఖాధికారి

మానవత్వం విలువలు చెప్పనిది మతమే కాదు

డాక్టర్ ఉమర్ ఆలీషా



సభలో మాట్లాడుతున్న ఉమర్ ఆలీషా

పిఠాపురం: మానవత్వం విలువల గురించి చెప్పనిది మతమే కాదని శ్రీ విశ్వ విజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా అన్నారు. స్థానిక పీఠం నూతన ఆశ్రమం ఆవరణలో శుక్రవారం నిర్వహించిన వైశాఖ పౌర్ణమి సభలో ఆయన మాట్లాడారు. మానవ కల్యాణానికి దారి తీసేది త్రయీ సాధనే అని చెప్పారు. నేటి ఆధునిక ప్రపంచంలో ఎక్కడ చూసినా ద్వేషం, పగ, అశాంతి, అసహనం, అసంతృప్తి, మారణ హోమం పెరిగిపోయి వినాశనం వైపు దారి తీస్తున్న దృష్టాంతాలు కనిపిస్తున్నాయని అన్నారు. భగవంతుడు ప్రసాదించిన ప్రకృతికి మానవుడు చేటు తెస్తున్నాడని ఆలీషా అన్నారు. కార్యక్రమంలో ఏవీవీ సత్యనారాయణ, ఎన్‌టీవీ ప్రసాద్, చింతపల్లి అమృత తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బైక్ అదుపు తప్పి.. ఇటుకల వ్యాపారి దుర్మరణం


మెర్ల బాబీ (పాతచిత్రం)

రాజానగరం/ఆత్రేయపురం: మోటార్ సైకిల్ అదుపు తప్పడంతో జరిగిన ప్రమాదంలో ఇటుకల వ్యాపారి దుర్మరణం పాలయ్యాడు. పదహారో నంబర్ జాతీయ రహదారిపై రాజానగరం సమీపంలోని ఐషర్ షోరూమ్ సమీపాన ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. ఆత్రేయపురం మండలం మెర్లపాలెం సర్పంచ్ రాము సోదరుడు, అదే గ్రామానికి చెందిన మెర్ల వెంకట నరసింహారావు(బాబీ - 60)కు ప్రత్తిపాడు మండలం రాచపల్లి వద్ద ఇటుక బట్టీలున్నాయి. వారానికోసారి అక్కడికి వెళ్లి, వ్యాపార లావాదేవీలు చూసుకుని వస్తూంటాడు. ఇదేవిధంగా శుక్రవారం తెల్లవారుజామున 3 గంటలకు మెర్లపాలెం నుంచి మోటార్ సైకిల్‌పై బయలుదేరాడు. వేకువనే బయలుదేరడం వలన నిద్ర మత్తు కమ్మిందో ఏమో కానీ.. ఉదయం 7.30 గంటల సమయంలో రాజానగరం దాటిన తరువాత మోటార్ సైకిల్ ఒక్కసారిగా అదుపు తప్పి, డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో బాబీ ఒక్కసారిగా బైక్ పైనుంచి రోడ్డుపై పడ్డాడు. తల రోడ్డుకు బలంగా తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. బాబీకి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. అతడి మృతితో మెర్లపాలెంలో విషాద ఛాయలు అలముకున్నాయి. బాబీ మృతికి పలువురు ప్రముఖులు సంతాపం తెలిపారు. మృతుని సోదరుడు శ్రీరామచంద్రమూర్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సుధాకర్ తెలిపారు.

అప్రమత్తత లేకుంటే ఆటపోట్లు

- క్రీడల్లో రక్షణ కవచాలు తప్పనిసరి
- లేకుంటే ఆటలకు శాశ్వతంగా దూరం

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఆరేళ్ల నుంచి 14 సంవత్సరాల లోపు బాలబాలికలు వివిధ రకాల ఆటలు ఆడటానికి ఉత్సాహం చూపుతారు. ఆసక్తి, అభిరుచి ఉన్న ఆటల్లో రాణించి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదగాలని కలలు కంటారు. ప్రస్తుతం వేసవి సెలవులు కావడంతో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరాల్లో చేరేందుకు బాలబాలికలు ఆసక్తి కనబరుస్తున్నారు. ఆడాలనే ఉత్సాహం ఉన్నా.. ఆడే సమయంలో, శిక్షణ పొందేటప్పుడు పలు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. లేకుంటే ఆడే క్రమంలో గాయాలపాలై ఒక్కోసారి క్రీడలకు శాశ్వతంగా దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతుంది. ఆయా క్రీడల్లో శిక్షణ పొందేవారు, క్రీడాకారులు సంబంధిత పరికరాలు, దుస్తులు, బూట్లు, ఇతర రక్షణ పరికరాలు తప్పనిసరిగా వినియోగించుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

క్రికెట్

క్రికెట్‌లో హెల్మెట్, గ్లౌజ్, ప్యాడ్స్, ఆర్మ్ గార్డ్, థైగార్డ్ వినియోగిస్తారు. ఎస్‌జీ, ఎస్ఎస్, బీడీఎస్, బీడీఎం, ఎంఆర్ఎం, జీఎం కంపెనీల బ్యాట్లు అందుబాటులో ఉన్నాయి. క్యాస్ట్ బ్యాట్ రూ.1,800 నుంచి రూ,3,500, ఇంగ్లిష్ బ్యాట్ రూ3,500 నుంచి రూ.60 వేలు, బాల్స్ రూ200 నుంచి రూ.250, మ్యాచ్ బాల్స్ రూ.450 నుంచి రూ.900, డ్రెస్ రూ.650 నుంచి రూ.3 వేలు, వికెట్లు, ప్యాడ్‌లు రూ.1,200 నుంచి రూ.1,500, కిట్‌బ్యాగ్ రూ.800 నుంచి రూ.15 వేలు, హెల్మెట్ రూ.1,100 నుంచి రూ.9 వేల వరకూ ఉన్నాయి.

ఫుట్‌బాల్

ఫుట్‌బాల్‌లో చిన్ గార్డ్స్, షూ వినియోగిస్తారు. బాల్స్ కాస్కో, నివ్య, విక్కీ, కాక్‌స్టన్, స్పాటన్ కంపెనీలవి ఉన్నాయి. బాల్స్ రూ.800 నుంచి రూ.2,500 వరకూ, నెట్స్ రూ.500 నుంచి రూ.15 వేల వరకూ, డెస్ రూ.800 నుంచి రూ.1,500 వరకూ ఉన్నాయి.

నాణ్యమైనవి ఉపయోగించాలి

సాధ్యమైనంత వరకూ నాణ్యమైన క్రీడా పరికరాలనే వినియోగించాలి. నాసిరకం, డూప్లికేట్ కంపెనీ వస్తువులు కొంటే మూన్నాళ్లకే మూలకు చేరడం ఖాయం. తాజాగా తయారు చేసిన క్రీడా పరికరాలు మాత్రమే వాడాలి. క్రికెట్, షటిల్, టెన్నిస్ బ్యాట్‌లు కొనుగోలు చేసినప్పుడు హ్యాండిల్స్, పగుళ్లు, ఫ్రేమ్ క్రాక్స్ లేకుండా చూసుకోవాలి. నాణ్యమైన గెట్ ఉన్న బ్యాట్లు కొనుగోలు చేయాలి. కొన్న వస్తువులకు బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలి. ఆయా కంపెనీలను బట్టి స్పోర్ట్స్ షూ ధరలు రూ.600 నుంచి రూ.10 వేల వరకూ పలుకుతున్నాయి.

బాస్కెట్‌బాల్

టీషర్ట్, షార్ట్, షూ వినియోగిస్తారు. కాస్కో, నివ్య, విక్కీ కంపెనీల బాల్స్ ధర రూ.750 నుంచి రూ.2,500 వరకూ ఉంది. డ్రెస్ రూ.900 నుంచి రూ.3 వేలు, షూ రూ.1,500 నుంచి రూ.8 వేలు, నెట్ రూ.400 నుంచి రూ.5 వేల వరకూ ఉన్నాయి.

వాలీబాల్

ఈ క్రీడలో ముఖ్యంగా షూ వినియోగిస్తారు. కాస్కో, నివ్య, విక్కీ కాక్‌స్టన్, స్పాటన్ కంపెనీల బాల్స్ రూ.600 నుంచి రూ.1800 వరకూ రేటు పలుకుతున్నాయి. నెట్ రూ.400 నుంచి రూ.5 వేల వరకూ, డ్రెస్ రూ.800 నుంచి రూ.8 వేల వరకూ ఉన్నాయి.

హాకీ

హెల్మెట్, చెస్ట్‌ప్యాడ్, బాడీ ప్రొటెక్షన్, గ్లౌజ్, ప్యాడ్, నీగార్డ్స్, ఎల్‌బోగార్డ్స్ వంటి రక్షణ పరికరాలు వినియోగిస్తారు. రషక్, ఆల్ఫా, ప్యాంటా, హ్యాంపెయిర్ కంపెనీల హాకీ స్టిక్స్ రూ.650 నుంచి రూ.5 వేల వరకూ, నెట్ రూ.25 వేలు, గోల్‌కీపర్ కిట్ రూ.10 వేల నుంచి రూ.25 వేల వరకూ ఉన్నాయి.


వివిధ రకాల క్రీడా పరికరాలు


క్రీడా పరికరాలు కొనుగోలు చేస్తున్న బాలిక


స్విమ్మింగ్ డ్రెస్, గాగుల్స్, క్యాప్

బ్యాడ్మింటన్

రిస్ట్‌బ్యాండ్లు, నీక్యాప్స్, షూ, టీషర్ట్, షార్ట్స్ వినియోగిస్తారు. ఫెదర్ కాక్స్ కొరత కారణంగా ఎక్కువ కాలం మన్నిక కోసం నైలాన్ కాక్స్ ఉపయోగిస్తున్నారు. యోనెక్స్, నివ్య, కాస్కో, కామాచి, లీనింగ్, యాష్‌వే, కాల్టన్ కంపెనీల బ్యాట్లు రూ.650 నుంచి రూ.15 వేల వరకూ, నెట్‌లు రూ.350 నుంచి రూ.3 వేల వరకూ, కాక్స్ బ్యారర్ రూ.300 నుంచి రూ.4 వేల వరకూ అమ్ముతున్నారు.

హ్యాండ్‌బాల్

హ్యాండ్‌బాల్‌లో టీషర్ట్, షార్ట్, షూ వినియోగిస్తారు. కాస్కో, నివ్య, విక్కీ బాల్స్ రూ.700 నుంచి రూ.5 వేల వరకూ, నెట్‌లు రూ.1,000 నుంచి రూ.2 వేల వరకూ ఉన్నాయి.

టేబుల్ టెన్నిస్

బటర్‌ఫ్లై, స్టాగ్, సైగ, జేకే, కంగ్‌ఫూ, కాస్కో టీటీ బ్యాట్లు రూ.400 నుంచి రూ.5 వేల వరకూ, బాల్స్ రూ.30 నుంచి రూ.250 వరకూ అమ్ముతున్నారు. స్టిగా, స్టాగ్, కాక్‌స్టన్ టీటీ బోర్డులు రూ.25 వేల నుంచి రూ.80 వేల వరకూ దొరుకుతున్నాయి.

స్కేటింగ్

స్కేట్స్, హెడ్‌గార్డ్, ఎల్‌బో గార్డ్, నీగార్డ్స్, షూ, స్కేటింగ్ డ్రెస్ వినియోగిస్తారు. స్కేటింగ్ షూ రూ.400 నుంచి రూ.10 వేలు, డ్రెస్ రూ.500 నుంచి రూ.5 వేలు, ప్రొటెక్షన్ కిట్ రూ.400 నుంచి రూ.4 వేల వరకూ ఉన్నాయి.

స్విమ్మింగ్

క్యాప్స్, గాగుల్స్, ఇయర్ ప్లగ్స్, డ్రస్ వినియోగిస్తారు. స్విమ్ సూట్స్ రూ.100 నుంచి రూ.2 వేల వరకూ, గాగుల్స్ రూ.150 నుంచి రూ.5 వేల వరకూ, షార్ట్స్ రూ.250 నుంచి రూ.2 వేల వరకూ విక్రయిస్తున్నారు.

అమ్మకాలు బాగున్నాయి



పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ప్రకటించడంతో క్రీడా పరికరాల కొనుగోళ్లు బాగా జరుగుతున్నాయి. నాణ్యమైన, మంచి కంపెనీకి చెందిన పరికరాలు కొనుగోలు చేస్తే ఎక్కువ కాలం మన్నుతాయి.

– టి.హరీష్, హరీష్ స్పోర్ట్స్

రక్షణ పరికరాలు ప్రధానం



ఆటలు ఆడుకునేటప్పుడు గాయాల బారిన పడకుండా ఉండాలంటే రక్షణ పరికరాలు వినియోగించడం తప్పనిసరి. ముఖ్యంగా బాక్సింగ్, హాకీ, క్రికెట్, స్కేటింగ్ వంటి క్రీడల్లో జాగ్రత్తలు తీసుకోవాలి. సాధ్యమైనంత వరకూ మంచి కంపెనీల క్రీడా పరికరాలనే కొనుగోలు చేయాలి.

– శ్రీనివాస్ కుమార్, చీఫ్ కోచ్, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ

పెళ్లి వేడుక నుంచి వెళ్తూ.. తిరిగిరాని లోకాలకు..

- పంట బోదెలోకి దూసుకుపోయిన మోటార్ సైకిల్
- యువకుడి మృతి
- మృతుడు కాకినాడ పోర్టులో క్వాలిటీ మేనేజర్


రాజేంద్ర ప్రసాద్ (పాతచిత్రం)

అల్లవరం/అంబాజీపేట: వివాహ వేడుకలో పాల్గొని తిరిగి వెళ్తున్న ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో తిరిగి రాని లోకాలకు వెళ్లిపోయాడు. స్థానికుల కథనం ప్రకారం.. అంబాజీపేట మండలం ఇసుకపూడి శివారు దాసరివారి పేటకు చెందిన పమ్మి రాజేంద్ర ప్రసాద్ (35) కాకినాడ పోర్టు ఎగుమతులు, దిగుమతుల విభాగంలో క్వాలిటీ మేనేజర్‌గా పని చేస్తున్నాడు. గురువారం రాత్రి రాజోలు సమీపంలోని తాటిపాకలో జరిగిన బంధువుల వివాహ వేడుకలో పాల్గొన్నాడు. శుక్రవారం మొదటి షిఫ్టులో అతడు విధులకు హాజరు కావాల్సి ఉంది. దీనికి ఆలస్యం కాకుండా ఉండాలనే ఉద్దేశంతో వివాహం అయిన వెంటనే రాజేంద్ర ప్రసాద్ తాటిపాక నుంచి కాకినాడకు మోటార్ సైకిల్‌పై బయలుదేరాడు. తెల్లవారుజామున బోడసకుర్రు బ్రిడ్జి దాటిన తర్వాత చర్చి ఎదురుగా అతడి మోటార్ సైకిల్ అదుపు తప్పి, జాతీయ రహదారి పక్కనే ఉన్న పంట బోదెలోకి దూసుకుపోయింది. తీవ్రంగా గాయపడిన రాజేంద్ర ప్రసాద్ వెంటనే తేరుకుని, బోదెలో నుంచి పైకి వచ్చాడు. కొన్ని క్షణాల వ్యవధిలోనే మృతి చెందాడు. అతడు నిద్ర మత్తులో లేదా వాహనానికి ఏదైనా అడ్డం రావడంతో ప్రమాదానికి గురై ఉంటాడని భావిస్తున్నారు. ఘటనా స్థలం వద్ద సిమెంట్ స్తంభాన్ని బలంగా ఢీకొట్టడం అతడి మృతికి కారణమని పోలీసులు భావిస్తున్నారు. రాజేంద్ర ప్రసాద్‌కు పెళ్లి సంబంధాలు చూస్తున్నారని, ఇంతలోనే మృత్యువాత పడ్డాడని బంధువులు రోదించారు. అతడి మృతితో దాసరివారిపేటలో విషాద ఛాయలు అలముకున్నాయి. ఇంటికి పెద్ద కొడుకు అయిన రాజేంద్ర ప్రసాద్ అందరితో కలివిడిగా, కుటుంబానికి ఆసరాగా ఉండేవాడని బంధువులు, స్నేహితులు కన్నీరుమున్నీరయ్యారు. వివాహ వేడుకల్లో అందరితో సరదాగా గడిపాడని బంధువులు విలపించారు. సంఘటన స్థలాన్ని పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు సందర్శించి, మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చారు. రాజేంద్ర ప్రసాద్ మృతికి సర్పంచ్ తరపట్ల మోహన్‌సింగ్ బాబూరావు, ఎంపీటీసీ సభ్యుడు ముత్తాబత్తుల ప్రశాంత్, ఏఎంసీ డైరెక్టర్ కోట విజయరాజు తదితరులు సంతాపం తెలిపారు. ప్రమాదంపై అమలాపురం ఎస్సై డి.ప్రభాకర్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.


సంఘటన స్థలంలో ఎమ్మెల్యే చిట్టిబాబు తదితరులు

ఘనంగా సత్యదేవుని శ్రీచక్రస్నానం

- వేడుకగా నాగవల్లి, దండియాడింపు
- నేడు సత్యదేవుని శ్రీపుష్పయాగం


సత్యదేవుని చక్రస్నాన ఉత్సవంలో పండితులు, ఈఓ అజాద్, ఏసీ రమేష్‌బాబు

అన్నవరం: వార్షిక దివ్యకల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఆరో రోజైన శుక్రవారం పంపా సరోవరంలో సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్ల శ్రీచక్రస్నాన ఉత్సవం వైభవంగా నిర్వహించారు. పెళ్లి పెద్దలు సీతారాములు వెంట రాగా, నవదంపతులైన సత్యదేవుడు, అమ్మవార్లను, ఉదయం 8.30 గంటలకు పంపా తీరానికి ఊరేగింపుగా తీసుకువచ్చారు. అక్కడి కల్యాణ మండపంలో సింహాసనంపై స్వామి, అమ్మవార్లను వేంచేయించి, పూజలు చేశారు. పండితుల మంత్రోచ్చారణల నడుమ పంచామృతాలతో స్వామి వారికి, శూలానికి అవభృథ స్నానం చేయించారు. అనంతరం సత్యదేవుని ఉత్సవ మూర్తిని, శూలాన్ని పంపా సరోవరం వద్దకు ఊరేగింపుగా తీసుకువెళ్లి మూడుసార్లు చక్రస్నానం చేయించారు. దేవస్థానం ఈఓ ఎస్ఎస్ చంద్రశేఖర్ అజాద్, అసిస్టెంట్ కమిషనర్ రమేష్‌బాబు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వేద పండితులు గొల్లపల్లి ఘనపాఠి, చిట్టి శివ, ముష్టి పురుషోత్తం, ప్రధానార్చకులు ఇంద్రగంటి నరసింహమూర్తి, కోట శ్రీనివాస్, అర్చకులు, పురోహితులు శాస్త్రోక్తంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. స్వామివారితో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు, గ్రామస్తులు కూడా పంపా జలాల్లో పుణ్యస్నానం ఆచరించారు. ఏర్పాట్లను సూపరింటెండెంట్ వెంకట రమణ పర్యవేక్షించారు.

సాయంత్రం రత్నగిరిపై అనివేటి మండపంలో స్వామి, అమ్మవార్లకు నాగవల్లి పట్టు, నీలలోహిత ధారణ, దండియాడింపు కార్యక్రమాలను పండితులు ఘనంగా నిర్వహించారు. సత్యదేవుడు, అమ్మవార్లను ప్రత్యేక వేదిక మీద, సీతారాములను మరో ఆసనం మీద వేంచేయించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రంగులతో నాగవల్లి తీర్చిదిద్ది, దానికి నాలుగు వైపులా 32 జ్యోతులు వెలిగించి, పూజలు చేసి, అమ్మవారికి నీలలోహిత ధారణ చేశారు. ఈ సందర్భంగా స్వామివారి కల్యాణం నాడు ఆరోహించిన ధ్వజాన్ని అవరోహణ చేశారు. తదనంతరం అర్చక స్వాములు బంతులాట, బిందెలో ఉంగరం వెతకడం వంటివి వేడుకగా చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్ల విగ్రహాలు పట్టుకుని అర్చకులు దత్తు శర్మ, పవన్ తదితరులు నృత్యం చేస్తూండగా వీరిపై మిగిలిన అర్చకులు రంగులు జల్లుతూ సందడి చేశారు. సత్యదేవుని ప్రధానాలయంలోని సత్యదేవుడు, అమ్మవార్ల మూలవిరాట్టుకు, రామాలయంలోని సీతారాముల విగ్రహాలపై కూడా రంగులు జల్లారు. సిబ్బంది కూడా పరస్పరం రంగులు జల్లుకుంటూ ఆనందంతో పరవశించారు.


స్వామి, అమ్మవార్లకు అవభృథ స్నానం నిర్వహిస్తున్న పండితులు

నేటితో కల్యాణోత్సవాల ముగింపు

దివ్యకల్యాణ మహోత్సవాల చివరి రోజైన శనివారం రాత్రి సత్యదేవుడు, అమ్మవార్ల శ్రీపుష్పయాగోత్సవం ఘనంగా నిర్వహించనున్నారు. ఈసారి స్వామివారి కల్యాణం నిర్వహించిన వార్షిక కల్యాణ మండపంలోనే శ్రీపుష్పయాగం ఘనంగా నిర్వహించనున్నామని ఈఓ తెలిపారు. రాత్రి 8.30 నుంచి 10 గంటల వరకూ ఈ కార్యక్రమం జరుగుతుంది. కల్యాణ మండపం ముందున్న విశ్రాంతి మండపం, దాని వెలుపల సుమారు 6 వేల మంది భక్తులు ఈ ఉత్సవం తిలకించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

భార్య, ప్రియుడే హంతకులు

- హత్య కేసులో వీడిన మిస్టరీ
- నాలుగు రోజుల్లో ఛేదించిన పోలీసులు


సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ ప్రశాంత్‌కుమార్, ఎస్సై చైతన్యకుమార్

అంబాజీపేట: వివాహేతర సంబంధానికి అడ్డంగా ఉన్నాడనే కక్షతో భర్తను భార్య, ఆమె ప్రియుడు కలిసి హత్య చేసిన ఉదంతమిది. ఈ కేసు వివరాలను పి.గన్నవరం సీఐ డి.ప్రశాంతకుమార్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం విలేకర్లకు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని గంగలకుర్రు అగ్రహారానికి చెందిన రాయుడు రవిశంకర్ తల్లి ఆదిలాబాద్‌లో ఉపాధ్యాయురాలిగా పని చేసేది. ఆ సమయంలో మృతుడు గజానంద్ బోడ్కర్ ఆమె కారు డ్రైవర్‌గా పని చేశాడు. కరోనాకు ముందు మసాలా వ్యాపారం నిర్వహించిన రవిశంకర్.. అది గిట్టుబాటు కాకపోవడంతో స్వగ్రామం గంగలకుర్రు అగ్రహారం వచ్చేశాడు. స్థానికంగా వర్మి కంపోస్ట్ యూనిట్ ఏర్పాటు చేశాడు.

తనకు సహకరించేందుకు గజానంద్ బోడ్కర్, ఊర్మిళ దంపతులను ఆదిలాబాద్ నుంచి రప్పించి, అమలాపురం మండలం బండారులంక మెట్ల కాలనీలో నివాసం ఏర్పాటు చేశాడు. వర్మి కంపోస్ట్ యూనిట్‌లో కూడా నష్టాలు రావడంతో రవిశంకర్.. రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటారు సైకిళ్ల విడిభాగాల వ్యాపారం చేశాడు. ఈ క్రమంలో గజానంద్ భార్య ఊర్మిళకు రవిశంకర్‌కు మధ్య వివాహేతర సంబంధం ఏర్పడింది. దీనికి అడ్డం వస్తున్నాడనే కక్షతో ఊర్మిళ భర్త గజానంద్‌ను గత ఏడాది నవంబర్ 23న పథకం ప్రకారం వర్మి కంపోస్ట్ షెడ్డులో కొట్టి చంపేశారు. అతడి మృతదేహాన్ని వర్మి కంపోస్టు యూనిట్‌లోనే దాచి పెట్టారు. ఇదిలా ఉండగా గంగలకుర్రు అగ్రహారంలో పనికి వెళ్లిన తన కుమారుడు కనిపించడం లేదంటూ గజానంద్ తండ్రి శివాజీ గత జనవరిలో హైదరాబాద్ అఫ్జల్‌గంజ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీనిపై దర్యాప్తు కోసం అక్కడి పోలీసులు అంబాజీపేట వచ్చారు. అనంతరం నాలుగు రోజుల క్రితం ఈ కేసును అఫ్జల్‌గంజ్ నుంచి అంబాజీపేట పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. వెంటనే ఎస్పీ ఎస్.శ్రీధర్ ఆదేశాల మేరకు కొత్తపేట డీఎస్పీ కె.వెంకట రమణ పర్యవేక్షణలో సీఐ డి.ప్రశాంత్‌కుమార్, ఎస్సై ఎ.చైతన్యకుమార్ ఈ కేసు దర్యాప్తు చేపట్టారు. సీఐ, ఎస్సైలు శుక్రవారం సంఘటన స్థలాన్ని సందర్శించారు. అనుమానం రావడంతో వర్మి కంపోస్ట్ యూనిట్ వద్ద తవ్వించారు. అక్కడ పూర్తిగా కుళ్లిపోయిన స్థితిలో గజానంద్ అస్థిపంజరం లభించింది. ఈ కేసులో హతుడి భార్య ఊర్మిళ, ఆమె ప్రియుడు రవిశంకర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసును అత్యంత చాకచక్యంగా నాలుగు రోజుల్లో ఛేదించిన సీఐ ప్రశాంత్‌కుమార్, ఎస్సై చైతన్యకుమార్, క్రైం పార్టీ సిబ్బందిని ఎస్పీ అభినందించారు.